# జరగాల్సిందే జరిగింది

కె. శేషు

సరళ వెళ్ళిపోయింది. ఔను! సరళ దొంగచాటుగా గాక పబ్లిగ్గానే అందరి యెదుటా వాళ్ళ నాన్నగారి కారులో వెళ్ళిపోయింది ఇద్దరు బిడ్డల్ని తీసుకొని వెళ్ళిపోయింది. తాను ఒంటరిగా మిగిలిపోయాడు. ఆనాటి నుండి ఒంటరిగా మిగిలిపోయిన గోపాలం జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. మెల్ల మెల్లగా త్రాగుడుకు అలవడ్డాడు. సాయంత్రమయ్యేసరికి క్లబ్బులు.... రాత్రి రెండు గంటల ప్రాంతాల్లో లాడ్జీల వెంబడి తిరుగుళ్ళు.... ఇవి ఈనాటి గోపాలం తీరు తెన్నులు. ఐనా సరే గోపాలం సరళను ఏనాడు తన మనస్సులో ఏవగించుకోలేదు.

నెలక్రితం ఉన్న ఉద్యోగం కాస్త ఊడింది. దాంతో గోపాలం స్థితి మరీ దిగజారిపోయింది. తెగిన గాలిపటంలా ఊళ్ళు తిరిగాడు. అప్పులాళ్ళు కనబడితే దొంగచాటుగా తప్పించుకోసాగాడు. చివరికి ఆకలి బాధను తాళలేక ఒకటి రెండు చోట్ల దొంగతనాలు చేశాడు, పట్టుబడ్డ గోపాలాన్ని స్తంభానికి కట్టి బాగా బాది వదిలిపెట్టారు. అదృష్టవశాత్తు అది తనకు సరికొత్తదైన వూరు. తనకు తెలిసిన వాళ్ళెవరూ లేరు.

గోపాలం మనస్సులో ఓ వింత ఆలోచన మెదిలింది. ఈ సమయంలో కూడా తనకు వస్తున్న ఆలోచనలకు గోపాలం ఆశ్చర్యపోయాడు. విషాదంగా నవ్వి వూరకుండిపోయాడు. లేకుంటే సరళ దగ్గరకి యిప్పుడు తాను వెళ్ళగలడా? వెళితే ఏమవుతుంది? ఏమో ఏమవుతుందో....

గోపాలం కూర్చున్న మఱ్ఱిచెట్టు క్రిందికి ఊరేగింపు వస్తున్నట్టుంది. ఛీ.... ఛీ.... వూరేగింపు ఊరి చివర స్మశానంలోకి పోయే యీదారిలోకి ఎందుకు వస్తుంది? అది వూరేగింపు ఏమాత్రం కాదు. దగ్గరికి వచ్చింది.... నిజమే, శవాన్ని మోసుకెళుతున్నారు. పాతికమంది వెళుతున్నారు మౌనంగా. గోపాలం తన తల్లిదండ్రుల్ని గూర్చి.... వాళ్ళు మరణించడాన్ని గూర్చి కాసేపు అనుకొన్నాడు చివరిసారిగా తాను వాళ్ళను చూచింది యెప్పుడు? వాళ్ళు కన్ను మూస్తూ మూస్తూ ఏమాలోచించారో ఏమో! కడచూపులకి కూడా తాను వెళ్ళలేదు. అయినా వాళ్ళు తనకోసం ఎదురు చూడకుండానే.... అచ్చంగా యిలాగే చివరి యాత్రచేసి వుంటారు వూరి వాళ్ళ సాయంతో. కాని తాను.... తాను కన్నుమూస్తే....

గోపాలం గుండెలో ఏదో బాధ

కలుక్కుమంది. నిజమే తాను దిక్కులేని చావు చావక తప్పదు. తనలాంటి వాళ్ళకు పరిష్కారం యిలాంటి యాత్రే ... తప్పదు. చచ్చాక తాను ఏమవుతాడో ఏమో.... ఎవరు మోసుకెళతారో.... ఎవరు ఎక్కడ సంస్కార క్రియలు జరుపుతారో .... తనకు తెలీదు. తాను తెలుసుకోలేడు.

.... .... ....

గతం గోపాలం కళ్ళముందు ఎంత వద్దనుకున్నా కదలడం మొదలెట్టింది.

గోపాలం తండ్రి కొలిమి పని చేసే వాడు. రెక్కలు ముక్కలయ్యేట్టు ఎంత గింజుకున్నా రెండు పూటలు గడవటం గగనంగా ఉండేది. అలాంటి పరిసితుల్లో చిన్నారి గోపాలం మనస్సు ఎంతో ఆరాట పడింది. ఆవేదనకు గురయ్యింది. చదవాలనిపించేది కాదు. కానీ నాన్నకు తెలిస్తే తంతాడు. ఆ భయమే గోపాలాన్ని స్కూలు ఫైనలు వరకు తరిమింది. ఈ లోగా ఉన్న ఎకరం పొలం అమ్మేయక తప్పలేదు.

స్కూలు ఫైనలు నుండి గోపాలం కథ రెండో మలుపు తిరిగింది. ఆ సంవత్సరం అతడికి స్కాలర్‌షిప్పు వచ్చింది. గోపాలానికి మంచి మార్కులొచ్చాయి. స్టేట్ రేంకు కూడా కొట్టేశాడు.


కాలేజీలో చేరిన గోపాలానికి ఫ్రీగా హాస్టల్లో సీటు వచ్చింది. స్కాలర్ షిప్పు కంటిన్యూ అయింది.ఆకలి బాధ దరిద్రవులో తులు చవి చూసిన గోపాలం వళ్ళు వంచి చదివాడు. లెక్కలేనన్ని పుస్తకాలు చదివాడు.గోపాలం చక్కని వక్త, మంచి ఆశయాలు గలవాడని అందరూ అనుకొన్నారు.

వరకట్నం .... మద్యపానం లాంటి సాంఘిక దురాచారాల్ని దుయ్యబడుతూ గోపాలం చాలా డిబేటలో పాల్గొన్నాడు. పాల్గొన్న ప్రతిచోట గోపాలం గెలిచేవాడు బంగారు మెడల్సు వందల కొద్ది పారితోషికం ముట్టేవి. గోపాలం ఆ డబ్బు తాతండ్రికి పంపేవాడు. ఇంట్లో పరిస్థితులు కొద్దికొద్దిగా మెరుగయ్యాయి. బస్తీలో తన కొడుకు పెద్దపెద్ద చదువులు చదువుతున్నాడన్న గర్వం వాళ్ళ తండ్రిలో మొదలైంది. అది మెల్లమెల్లగా గోపాలం చదువుతో పాటు పెరిగింది. గోపాలం యం. ఏ. పూర్తిచేసే నాటికి అతని తండ్రి ఆపల్లెటూళ్ళో మకుటంలేని మహారాజులా వెలిగి పోయాడు.

గోపాలం రూపాన్ని తెలివితేటల్ని చూసిన ఒకరిద్దరు అమ్మాయిలు అతణ్ణి ప్రేమించామని వెంటబడ్డారు. కాని గోపాలం జాగ్రత్త పడ్డాడు. కర్తవ్యాన్ని గుర్తుంచుకొని తన పరిస్థితుల్ని వివరించి అనునయంగా వాళ్ళకి నచ్చ జెప్పాడు.

ఎం. ఏ పాసయిన వెంటనే గోపాలం ప్రొబేషనరీ ఆఫీసరు టెస్టు వ్రాశాడు. సెలక్టయ్యాడు. ఉద్యోగమూ దొరికింది. ఆ డిగ్రీ ఆఉద్యోగం తానే వెలగ బెడుతున్నట్టు వాళ్ళ నాన్న ప్రవర్తించేవాడు. గోపాలాన్ని ఒకపని కూడా చెయ్యనిచ్చేవాడు కాదు.

ఈ నాడుగోపాలం తండ్రిసమాజంలో ఒక గొప్ప వ్యక్తిగా చలామణీ అవుతున్నాడు. గతాన్ని పూర్తిగా మరిచాడు. గోపాలానికి పెళ్ళిసంబంధాలువస్తున్నాయి.




వరుల మార్కెట్టులో గోపాలం ధర తారస్థాయిలోకి పెరిగింది.

చదివే రోజుల్లో తాను కులాంతరం చేసుకుంటానని.... పేదింటి బిడ్డను కట్నం లేకుండా చేసుకుంటానని .... యింకా వీలయితే ఏ అనాథ ఆశ్రమంలోనో వుండే అమ్మాయిని చేసుకుంటానని పెద్ద పెద్ద సభల్లో యింకా పెద్దపెద్ద మనుషుల ముందు ప్రమాణాలు చేసేవాడు చప్పట్లతో సభలు మారు మ్రోగేవి.

ప్రతిక్షణం తన తండ్రి తన స్టేటస్‌ను గుర్తు చేస్తూండడంతో గోపాలం కూడా గతాన్ని మెల్ల మెల్లగా మరచిపోవడం మొదలెట్టాడు. గడచిందంతా ఓ పీడకల అనుకోమన్నాడు వాళ్ళ నాన్న. తన క్లాసు మేట్సు ఎవరన్నా కనబడి నీ ఆదర్శ వివాహం ఎంత వరకొచ్చిందోయ్ అని నిలదీస్తారేమోనని మొదట్లో కొంత భయపడ్డా రోజులు గడిచే కొద్దీ తండ్రిలాగే తాను మొండిబారి పోయాడు

మార్కెట్టులోని వరుడి పేటలో గోపాలం అనే వరుడు సరళ అనే వన్నెల విసనకర్ర తండ్రికి చిక్కాడు. యాభై ఎకరాల పొలం-ఒక లక్ష క్యాష్- పాతిక తులాల బంగారంతో గోపాలం కొనబడ్డాడు. అంటే యివన్నీ గోపాలనికిచ్చారనికాదు. ఇవన్నీ ఆ బంగారు పిచ్చుక తండ్రి బంగారు పిచ్చుక అయిన సరళ కిచ్చాడు.

ఘనంగా జరిగిన తన కొడుకు పెళ్ళిని తన వియ్యంకుడు రాజాపురం జమీందారు మోహనరావుగారి స్టేటస్‌ని తలచుకొని గోపాలం తండ్రి ఎంతో మురిసిపోయాడు. కొలిమి తిత్తి ముందు-చెమటలు కార్చిన ఆరోజులు అతనికి గుర్తు వచ్చినప్పుడల్లా మానవుడికి పాత స్మృతుల్ని జ్ఞాపకంలోకి తెచ్చే దేవుణ్ణి నిలువునా చీల్చి పాతెయ్యాలనుకొనేవాడు.... ఒకప్పుడెంతో సనాతనుడూ-ఆస్తికుడూ నైన కమ్మరి కమలయ్య

సరళ కాపరానికివచ్చి మూణ్ణెల్లు ముచ్చటగా సాగింది. మనుషుల ఆత్మ

గౌరవాలమీద అడుగులు పెట్టి నడవడం తప్ప నేలమీద సాధారణంగా నడిచి యెరగని సరళ గోపాలం తల్లిదండ్రుల్ని పురుగులకన్నా హీనంగా చూడ్డం మొదలెట్టింది. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షులా బ్రతలేకపోయారు ముసిలాళ్ళు.

గోపాలం తండ్రికి చేసిన పొరబాటు తెలియడానికి ఆట్టే వ్యవధి పట్టలేదు. ఏ బీదపిల్లో తన కోడలయుంటే .... ఎలావుండేది? ఈ ఆలోచనవస్తే పాపం ముసిలాడు మూడడుగులు మనిషిలా కుంచించుకు పోయేవాడు.

అయిదో నెలల్లా యిద్దరు ముసిలాళ్ళూ యింటి నుంచి గెంటివేయబడ్డారు. కమ్మరి కనులయ్య కొడుకు... సారీ స్టేట్ బాంకి ఆఫీసరు గోపాలంగారు చూస్తూండి పోయారేగాని కిమన్నాలేదు.- కుమ్మనలేదు. మరో ఆరెల్లలకల్లా యిద్దరూ కన్ను మూశారు వాళ్ళ చివరి క్షణాల్లోగూడా తాను వెళ్ళి కడసారి చూపులకు నోచుకోలేక పోయాడు.

గోపాలం ఎంత నచ్చచెప్పుకొన్నా సరళ తన పూర్వపు వాసనల్ని వదల్లేక పోయింది. గోపాలంజీ తరుంలేఆమెకు ఒక లక్ష్యం వుండేదికాదు. అదొక సంపాదనతగా వుండేదికాదు. తన తండ్రి యిచ్చిన ఆస్తిలోనుండి వచ్చే ఆదాయం ముందు యిదొక లెక్కలోనికి రాకపోవడం సహజమే. నాలుగేళ్ళు తిరిగేసరికి ఒక అమ్మాయి- అబ్బాయి పుట్టారు సరళకి. పిల్లలు పుట్టాక సరళ ప్రవర్తన మరీ విపరీతమైపోయింది. తలుచుకొన్నప్పుడు షికార్లు - సినిమాలు - క్లబ్బులు తిరుగుళ్ళు ఎక్కువయ్యాయి. రహస్యంగా తన కాలేజి స్నేహితుల్ని కలుసు కోవడాలు ఎక్కువవడంతో - అతి రహస్యం బట్టబయలు అన్నట్లు గోపాలం చెవికి యీ వార్తలు రావడం మొదలెట్టాయి.

ఒకనాడు గోపాలం సరళను నిలేసి అడిగాడు. అంతే సరళ తారాజువ్వయిపోయింది చెడామడా వాగింది. ఆ గంటకల్లా వాళ్ళ నాన్నకి మేఘాలమీద ట్రంక్ కాల్ వెళ్ళింది తీగెలమీద కాకుండా. మరునాటి రోజు ఉదయానికల్లా దుక్కల్లాంటి యిద్దరు గుండాలతో జమీందారుమోహనరావు రు కారుతీసుకొచ్చి నిలిపారు గోపాలం యింటి ముందు ఎప్పుడు సర్దిందో గాని తన వస్తువులు ఒక్కటీ వదలకుండా మరో లారీలో వేయించుకొని కనీసం మాటమాత్రంకూడా తనతో చెప్పకుండా సరళ వెళ్ళిపోయింది.

దాంపత్య జీవితానికి- ఆర్థిక వ్యవస్థలకీ ఉన్న సంబంధాల్ని గూర్చి వితర్కించుకొంటూ వుండి పోయిన గోపాలానికి దూరంగా సర్కార్ ఎక్స్ప్రెస్ కూత వినబడింది. ఉలిక్కిపడ్డ గోపాలానికి కర్తవ్యం కనబడింది. నేరం నేరమే! తెలిసి చేసినా- తెలియక చేసినా స్వతంత్రంగా చేసినా- పరిస్థితుల ప్రభావానికి లోబడి చేసినా ఫలితం మాత్రం అనుభవించక తప్పదు. అనుభవించక తప్పలేదు తనకు. అనుభవించింది చాలంటూ గోపాలంలేచి విసవిసా నడుస్తూ రైలు కట్టఎక్కాడు. మరు క్షణం సర్కార్ ఎక్స్ప్రెస్ గోపాలం శరీరంపై దూకుడుగా దూసుకు పోయింది. ఆ కటిక చీకట్లో.